

ముగిసిన ‘ఎల్‌సీడీసీ’

జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేక సర్వే నిర్వహిస్తోంది. 8లో▸



పెండింగ్ వేతనాలివ్వండి

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸



మహిళా ఆరోగ్యంతోనే..

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాల్లో సంతోషం ఉంటుందని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినితాదేవి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అహ్మదాబాద్ పర్యటనకు ఎమ్మెల్యే కసిరెడ్డి



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంత్రి జూపల్లితో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగర పర్యటన కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం సాయంత్రం బయలుదేరారు. అహ్మదాబాద్‌లోని సుందరీకరణ పనులను పరిశీలించడానికి రాష్ట్రం నుంచి ఎక్సైజ్, పర్యాటక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుల్ల రాజేశ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి తదితరులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు రేషన్‌కార్డు లేదా ఆహారభద్రత కార్డు ఉంటే సరిపోతుందని తెలిపారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. అన్ని మున్సిపాలిటీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మండల, మున్సిపాలిటీ కార్యాలయాల్లోని ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. పీడీ డీఆర్‌డీఏ, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోడల్ అధికారులుగా ఉన్నారని, బ్యాంకు మేనేజర్లు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేయాలని, ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

తుర్కయంజాల్‌లో ఒడిశా బృందం



నిర్మాణంలో ఉన్న సంఘం గోదామును పరిశీలిస్తున్న బృందం సభ్యులు

తుర్కయంజాల్: ఒడిశా రాష్ట్రంలోని రైడ జిల్లా నుంచి 15 రైతు సహకార సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యుల బృందం సహకార పర్యటనలో భాగంగా మంగళవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా వారు సంఘం పనితీరును పరిశీలించి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షపై ప్రతిఘటన పోరాటాలు



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఇబ్రహీంపట్నం: గ్రామాలు, పట్టణాల్లో ఇప్పటికీ కుల వివక్ష, అంటరానితనం ప్రత్యక్షంగా, పరోక్షంగా కొనసాగుతున్నాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో మంగళవారం కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ పలు గ్రామాల్లో దళితులకు ఆలయ ప్రవేశాలు లేవని.. బతుకమ్మ ఆడనీయడంలేదని.. క్షవరం చేయడంలేదని.. దసరా పర్వదినాన జమ్మి ఆకులు తెంపారని దాడులు చేస్తున్నారని.. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి.. పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వండితే విద్యార్థులు భుజించకపోవడం.. పట్టణాల్లో అద్దెకు ఇళ్లు ఇవ్వకపోవడం తదితర వివక్షత కొనసాగుతోందన్నారు. దీనిపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సామెల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్‌తో, నాయకులు చెన్నయ్య, ఆనంద్, వెంకటేశ్, బుచ్చయ్య, భాస్కర్, వీరేష్, జంగయ్య, అశోక్, నరసింహ, ఆశీర్వాదం, యాదగిరి, శ్రీనివాస్, సాయిలు పాల్గొన్నారు.

‘ఎర్లీ’గా కట్టేయండి..

ఈనెల 30లోపు ఆస్తిపన్ను చెల్లించండి

- ఐదు శాతం రాయితీ అందుకోండి
- మున్సిపాలిటీల్లో ‘ఎర్లీ బర్డ్’ పథకం
- ముందస్తు పన్ను చెల్లింపుదారులకు సదావకాశం
- సత్కరిస్తూ.. ప్రోత్సహిస్తున్న అధికారులు



షాద్‌నగర్: కొత్త ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలుపై మున్సిపల్ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముందస్తుగా ఆస్తి పన్ను వసూలు చేసేందుకు ఎర్లీ బర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి ఏడాది లాగానే ఈసారి కూడా రాయితీని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పన్నుదారులకు ఊరట

అస్తి పన్ను క్రమం తప్పకుండా చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఊరట కల్పిస్తోంది. ఈనెల 1 నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. దీనికి సంబంధించి ఆస్తి పన్ను మదింపు డిమాండ్ ఇంటి నంబర్ల వారీగా మున్సిపల్ వెబ్‌సైట్‌లో వచ్చేసింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి అంటే మార్చి 2026 వరకు పన్ను మొత్తం చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. బకాయిలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు బలవంతం చేసే అవకాశం ఉండదు.

ఈనెల 30 వరకే అవకాశం

పన్ను రాయితీ ఐదు శాతం కేవలం రాబోయే సంవత్సరానికి ముందుగా చెల్లించిన దానికి మాత్రమే వర్తిస్తుంది. ఈనెల 30వ తేదీలోపు చెల్లించే వారికే ఈ అవకాశం ఉంటుంది. ఈ మేరకు అధికారులు ఎర్లీ బర్డ్ పథకం కింద పన్నులు స్వీకరిస్తున్నారు. ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకొని ముందస్తుగా పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించే వారిని అధికారులు సత్కరిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

వీరే అర్హులు

2024- 25 ఆర్థిక సంవత్సరంలో నివాస, నివాసేతర ఆస్తులపై ఎలాంటి బకాయిలు లేకుండా పన్ను పూర్తిగా చెల్లించిన వారు ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీ బర్డ్ పథకానికి అర్హులు. రాయితీ పొందాలనుకునే వారు గతేడాది తమ ఆస్తి పన్నును పూర్తిగా చెల్లించి ఈ ఏడాదికి సంబంధించి ముందస్తుగా చెల్లించినా రాయితీ ఇవ్వనున్నారు.

నిధుల సమీకరణ కోసం

మున్సిపాలిటీలకు సాధారణ నిధి కింద వచ్చే నల్లా పన్నులతో పాటు దుకాణాల అద్దె, వర్తక పన్ను, వాణిజ్య ప్రకటనలపై వచ్చే ఆదాయంతో పోలిస్తే ఆస్తి పన్ను ఎంతో కీలకం. మున్సిపాలిటీల నిర్వహణ ఖర్చుకు అవసరమైన సాధారణ నిధి సమీకరణ కోసం ఈ పథకానికి మున్సిపల్ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ పథకంపై విస్తృతంగా ప్రచారం కల్పించి ముందస్తుగా ఆస్తి పన్ను రాబట్టే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.



షాద్‌నగర్‌లో ముందస్తు పన్ను చెల్లిస్తున్న ఇంటి యజమాని

సద్వినియోగం చేసుకోవాలి



ముందస్తు పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం అందిస్తున్న ఐదు శాతం రిబేటును ఇళ్లు, దుకాణాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. గడువు దాటితే వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది. రాయితీని అందరు సద్వినియోగం చేసుకొని పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

– సునీత, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

వడివడిగా ‘మెగా వెంచర్’

- ఫార్మాసిటీ లబ్ధిదారులకు పరిహారం ప్లాట్లు
- చివరి దశకు చేరిన నిర్మాణ పనులు
- త్వరలో పంపిణీ చేస్తామని చెబుతున్న అధికారులు



బేగరికంచె సమీపంలో ప్లాట్ల పంపిణీకి సిద్ధమైన మెగా వెంచర్

కందుకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ(గతంలో ఫార్మాసిటీ) నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారంతో పాటు అదనంగా కేటాయించనున్న ప్లాట్లకు సంబంధించి చేపట్టిన మెగా వెంచర్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. లబ్ధిదారులకు పంపిణీ చేయడమే మిగిలింది.

ఎకరాకు 121 గజాలు

అప్పటి ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలో 19,333 ఎకరాలు సేకరించడానికి నిర్ణయించింది. కందుకూరు, యాచారం మండలాల్లో 14 వేల ఎకరాల వరకు సేకరించింది. అందులో కోర్టు కేసులు, ఇతర సమస్యలు పోను ఎలాంటి వివాదాలు లేని భూములు సుమారు 12 వేల ఎకరాల వరకు ఉంటాయి. అప్పట్లో ఆయా భూములకు పరిహారం చెల్లించడంతో పాటు అదనంగా ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాటు ఇవ్వడానికి నిశ్చయించి సర్టిఫికెట్లు సైతం జారీ చేశారు. కందుకూరు మండలం పంజుగూడ రెవెన్యూలో సేకరించిన భూమికి రైతులకు ఇవ్వాల్సిన 155 ప్లాట్లకు గాను 128 ప్లాట్లకు, మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో 702 ప్లాట్లకు గాను 513 ప్లాట్లకు, ముచ్చర్ల రెవెన్యూలో 725 ప్లాట్లకు గాను 597 ప్లాట్లకు సంబంధించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు జారీ చేశారు. యాచారం మండలం కుర్మిద్ద రెవెన్యూలో 1,236 ప్లాట్లకు గాను 514 ప్లాట్లకు, నానక్‌నగర్ రెవెన్యూలో 359 ప్లాట్లకు గాను 158 ప్లాట్లకు, తాడిపర్తి రెవెన్యూలో 543 ప్లాట్లకు గాను 278 ప్లాట్లకు, మేడిపల్లి రెవెన్యూలో 1,600 ప్లాట్లకు గాను 1,182 ప్లాట్లకు సంబంధించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు జారీ చేశారు. లబ్ధిదారులకు కేటాయించడానికి మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో బేగరికంచె పంచాయతీ సమీపంలో 622 ఎకరాల విస్తీర్ణంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో మెగా వెంచర్ నిర్మాణం చేపట్టింది ప్రభుత్వం. పనులు చివరి దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం రోడ్లపై తారు వేసే పనులు కొనసాగుతున్నాయి. ప్లాట్లుగా విభజించి హద్దు రాళ్లు సైతం పాతారు. వాటిపై ప్లాట్ల నంబర్లు రాయించారు. ఇక లబ్ధిదారులకు కేటాయించడమే తరువాయి.

పొట్లు లేకుండా ప్లాట్లు కేటాయించేలా..

కాగా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్లాట్లను కేటాయించడానికి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఒకే కుటుంబానికి సంబంధించి ఎన్ని ప్లాట్లు ఉంటే అన్నీ ఒకే దగ్గర ఇవ్వడానికి కృషి చేస్తున్నారు. దానికి సంబంధించి నెల రోజుల క్రితం ఆయా గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల వివరాలను అందుబాటులో ఉంచారు. లబ్ధిదారుల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు సేకరించారు. వాటి ఆధారంగా వారికి ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించనున్నారు.

త్వరలో రిజిస్ట్రేషన్లు



రైతులకు కేటాయించిన ప్లాట్లకు సంబంధించి ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్టిఫికెట్లు పొందిన రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించి వెంటనే రిజిస్ట్రేషన్లు చేయడానికి చూస్తున్నాం. ఒక కుటుంబానికి ఒకే దగ్గర ప్లాట్లను కేటాయించేలా పరిశీలిస్తున్నాం. వారి నుంచి అభిప్రాయాలు సేకరించి ప్లాట్ల పంపిణీ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తాం.

– జగదీశ్వర్‌రెడ్డి, ఆర్డీఓ, కందుకూరు

‘ఫార్మా’ భూములకు ముమ్మరంగా ఫెన్సింగ్

యాచారం: ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం నక్కర్తమేడిపల్లి నుంచి ప్రారంభమైన సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నక్కర్తమేడిపల్లి, పల్లెచల్కతండా, నానక్‌నగర్ గ్రామం నుంచి తాడిపర్తి గ్రామ శివారు వరకు సర్వే పూర్తయింది. ఇప్పటి వరకు 19 కిలోమీటర్ల సర్వే, 9 కిలోమీటర్ల బౌండరీ, 4 కిలోమీటర్ల ఫెన్సింగ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. రాచకొండ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. కాగా, నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ గ్రామాల మధ్య కొనసాగుతున్న ఫార్మాసిటీ భూముల సర్వేను మంగళవారం టీజీఐఐసీ ఈడీ పవన్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పరిశీలించారు. సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనుల్లో భాగస్వామ్యమైన సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు.



పోలీస్ బందోబస్తు మధ్య ఫార్మాసిటీ భూముల సరిహద్దును గుర్తిస్తున్న సిబ్బంది

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

రెండో రోజు కొనసాగిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుత్మంతుడికి, ధ్వజస్తంభానికి అభిషేకం నిర్వహించి తిరుమల కిరణాచారి, పరావస్తు రమాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గరుత్మంతుడి పటాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభానికి ఆవిష్కరించారు. నవకలశ స్నాపకం, గరుత్మంతుని ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. గరుడ పటానికి నాలుగు దిక్కుల గరుత్మంతుని రూపాలు ప్రతిష్ఠించి నైవేద్యాన్ని సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీ నర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నరసింహన్, మురళీ, కిట్టు, కృష్ణమూర్తి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన భక్తుల తాకిడి..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం కార్యక్రమానికి ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చేవారు. ధ్వజారోహణం సందర్భంగా గరుత్మంతునికి నైవేద్యం సమర్పించి సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదాన్ని అందజేసేవారు. గతేడాది లక్షలాది మంది మహిళలు గరుడ ప్రసాదంకోసం రావడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. తోపులాటలు, ట్రాఫిక్ జాంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతేడాది జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఈసారి గరుడ ప్రసాదం పంపిణీ ఉండదని ఆలయ అర్చకుడు రంగరాజన్ ముందుగానే ప్రకటించారు. దీంతో ఈసారి భక్తులు తాకిడి భారీగా తగ్గింది.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి గోప వాహన, హనుమంత వాహన సేవలు అందించనున్నారు. గోప వాహనం, హనుమంత వాహనంపై స్వామివారిని ఆసీనులను చేసి ఆలయ పురవీధుల్లో ఊరేగిస్తారు.

డిగ్రీ కోర్సులకు ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ప్రథమ సవత్సరంలో ఎంపీసీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ, బీకాం కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థినులు డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు నేరుగా కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 97034 41345, 84640 06525, 77021 56402 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం

కాంగ్రెస్ ఆదివాసీ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘునాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్న తరుణంలో కేంద్రం గ్యాస్ సిలిండర్ ధర పెంచి పేదలపై ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలను నియంత్రించాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. తమది పేదల ప్రభుత్వం అని, పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెబుతున్న కేంద్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, అందె మోహన్, దిలీప్, సత్తయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాయక్

సత్వర పరిష్కారం

అందుబాటులోకి ‘ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం’

- ‘సూపర్ వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విజేషన్’తో అనుసంధానం
- విద్యుత్ సరఫరా నిలిచిన వెంటనే సమాచారం
- ఉన్నతాధికారులను అలర్ట్ చేసే అవకాశం
- కూర్చున్న చోటే క్షేత్రస్థాయి పనులను పరిశీలించే చాన్స్
- అందుబాటులోకి తెచ్చిన డిస్కం



ఆఫీస్ నుంచి మానిటరింగ్ చేస్తున్న సీఎండీ ముషారఫ్ ఫారుఖీ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. సబ్‌స్టేషన్లలో తరచూ తలెత్తే సాంకేతిక సమస్యలు సహా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ఈదురుగాలితో కూడిన వర్షానికి ఫీడర్ ట్రిప్ అవుతుండటం, షార్ట్‌సర్క్యూట్ కారణంగా అండర్ గ్రౌండ్(యూజీ) కేబుల్స్, ఎయిర్ బంచడ్ (ఏబీ) కేబుల్స్ జాయింట్ల వద్ద తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిన విద్యుత్ సరఫరాపై సీఎండీ మొదలు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అలర్ట్ చేసే ‘ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం’ (ఎఫ్ఓఎంఎస్) సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ‘సూపర్ వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విజేషన్’ (స్కాడా)కు అనుసంధానం చేసింది. దీంతో ఏ సబ్‌స్టేషన్‌లోని ఫీడర్.. ఏ సమయంలో ట్రిప్ అయింది.. ఏ ప్రాంతానికి.. ఎంత సమయం కరెంట్ సరఫరా నిలిచిపోయింది.. సరఫరాను ఎన్ని గంటల్లో పునరుద్ధరించారు.. వంటి సమగ్ర సమాచారం ఉన్నతాధికారులకు చేరవేస్తోంది. ఫలితంగా కరెంట్ కోతలు, సరఫరా పునరుద్ధరణలో చోటు చేసుకుంటున్న జాప్యంపై క్షేత్రస్థాయి సిబ్బంది సాకులు చెప్పి తప్పించుకునే అవకాశం ఉండదు.

ఆరా తీయాల్సిన అవసరం లేకుండా..

ఈదురు గాలులతో కూడిన వర్షానికి పెద్ద సంఖ్యలో ఫీడర్లు ట్రిప్పవుతుంటాయి. ఒకేసారి అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ సమయంలో ఎవరైనా వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్‌సెంటర్ (ఎఫ్ఓసీ) సహా 1912/ లేదా క్షేత్రస్థాయి జేఎల్ఎం, ఏఈలకు సమాచారం ఇస్తే కానీ సంబంధిత అధికారులకు విషయం తెలిసేది కాదు. సాంకేతిక సమస్య గుర్తింపు క్షేత్రస్థాయి సిబ్బందికి పెద్ద సమస్యగా మారేది. అర్ధరాత్రి జోరున కురిసే వర్షం లోనూ లైన్ టు లైన్ తిరగాల్సి వచ్చేది. సమస్యను గుర్తించి, సరఫరాను పునరుద్ధరించేందుకు రెండు మూడు గంటల సమయం పట్టేది. ఇంట్లో కరెంట్ లేకపోవడంతో వినియోగదారుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చేవి. ఈ సమయంలో సీఎండీ సహా ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఫోన్ చేసి ఆరా తీస్తే.. సరైన కారణం చెప్పే వారు కాదు. కొంత మందైతే ఏకంగా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే వారు. ఇది వారికి తలనొప్పి గా మారేది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టంతో తలెత్తిన సాంకేతిక సమస్యతో పాటు సరఫరా పునరుద్ధరణ వెంటనే తెలిసిపోతుంది. కేంద్ర కార్యాలయాల్లో కూర్చొనే క్షేత్రస్థాయి సిబ్బంది పని తీరును మానిటరింగ్ చేసే వెసులుబాటు కలుగుతుంది.

అత్యవసర పరిస్థితుల్లో కీలకం

గ్రేటర్‌లో 11 కేవీ ఫీడర్లు 3,421 వరకు ఉన్నాయి. వీటిలో 1,353 ఫీడర్లను ఇప్పటికే ఈ ఎఫ్ఓఎంఎస్ పరిధిలోకి తీసుకొచ్చింది. ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే తెలుసుకునే అవకాశం ఉంది. నాలుగు రోజుల క్రితం భారీ ఈదురుగాలితో కూడిన వర్షానికి గ్రేటర్‌లో 449 ఫీడర్లు ట్రిప్పయ్యాయి. ఈ ఎఫ్ఓఎంఎస్ సహకారంతో 410 ఫీడర్ల పరిధిలో అర గంటలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సోమవారం హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో హిందీనగర్, ఆలియాబాద్, బ్యాంక్‌కాలనీ సహా హబ్సీగూడ సర్కిల్ పరిధిలో బోడుప్పల్, సూర్యహిల్స్‌కాలనీ ఫీడర్ల పరిధిలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రాగాటూల్స్, రైతుబజార్, మేడిబావి, ఆర్పీనిలయం, ఈఎంఈ ఫీడర్ల పరిధిలోనూ సాంకేతిక సమస్యలు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎఫ్ఓఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరాను పునరుద్ధరించడంతో పాటు తలెత్తిన సాంకేతిక సమస్యలను గుర్తించి, వ్యవస్థను చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

వ్యక్తి దుర్మరణం

నందిగామ: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రంగాపూర్ శివారులో (44 నెంబరు జాతీయ రహదారి) బైపాస్ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన ఆంజనేయులు(48) భిక్షాటనతో పాటు ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు సేకరించి అమ్ముకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో 44వ నంబరు జాతీయ రహదారిపై రంగాపూర్ శివారులోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు తీవ్రగాయాలకు గురయ్యాడు. విషయం తెలసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆంజనేయులు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు 108 కు కాల్ చేస్తే అంబులెన్స్ వాహనం సకాలంలో రాలేదని.. లేదంటే తన భర్త బ్రతికేవారని మృతిడి భార్య ఆరోపించారు.

పోగొట్టుకున్న బంగారం రికవరీ



బాధితుడికి బంగారం అప్పగిస్తున్న సీఐ, ఎస్ఐ

కేశంపేట: శుభకార్యంలో జరిగిన గొడవలో బంగారం పోగుట్టకున్న వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి పోగొట్టుకున్న బంగారు ఆభరణాన్ని రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. వివరాలు.. మండల పరిధిలోని సంతాపూర్‌కు చెందిన గుండేటి నర్సింహ సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌లో నిర్వహిస్తున్న శుభకార్యానికి హాజరయ్యాడు. అక్కడ బంధువులతో జరిగిన గొడవలో తన రెండు తులాల బ్రాస్‌లెట్ పోగొట్టుకున్నాడు. మంగళవారం బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సీసీ కెమెరాలను పరిశీలించాడు. బంగారం తీసుకున్న వ్యక్తిని గుర్తించి అతడి వద్ద నుంచి రికవరీ చేశారు. సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ బాధితుడికి రికవరీ చేసిన బ్రాస్‌లెట్ అప్పగించారు.

వ్యక్తి బలవన్మరణం

కొందుర్గు: కుటుంబ సమస్యల కారణంగా తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని గంగన్నగూడలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకింది రాములు(35)కు 12 ఏళ్ల క్రితం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కవితతో వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు సంతానం. పది రోజుల క్రితం కుమారుడు అస్వస్థతకు గురవ్వడంతో కవిత పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రాములుకు వ్యవసాయంలో నష్టం రావడం, కుమారుడి ఆరోగ్యం బాగులేకపోవడం, భార్య పుట్టింటికి వెళ్లడంతో తాగుడుకు బానిసయ్యాడు. మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం రాములు గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపు తట్టిచూడగా అప్పటికి ఉరేసుకుని మృతి చెందియున్నాడు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైన్స్‌లో చోరీ

యాచారం: ఓ వైన్స్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.30 వేల నగదు చోరీ చేశారు. వివరాలు.. మండల కేంద్రంలోని నందివనపర్తి రోడ్డులో లక్కీవైన్స్ యజమానులు సోమవారం రాత్రి షాప్‌నకు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం వైన్స్ వద్దకు వచ్చి చూడగా షటర్లు పగులగొట్టి ఉన్నాయి. గల్లాపెట్టెలోని రూ.30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన 'ఎల్‌సీడీసీ'



మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

52 మంది అనుమానితుల గుర్తింపు

- 2027 వరకు కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యం

కేశంపేట: ప్రభుత్వం 2027 వరకు కుష్టు వ్యాధి రహిత సమాజంగా మార్చేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగా జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేక సర్వే నిర్వహిస్తోంది. ఈ మేరకు మండలంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు మార్చి 17 నుంచి 30 వరకు లెప్రసీ కేస్ డిటెక్టివ్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) చేపట్టింది.

ఇంటింటి సర్వే

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎనిమిది సబ్‌సెంటర్లు ఉన్నాయి. 29 పంచాయతీల పరిధిలో సుమారుగా 48 వేల జనాభా ఉంది. ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధి సర్వే చేపట్టారు. ఈ సర్వేను సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 52 మంది అనుమానితులను గుర్తించి ఉన్నతాధికారులకు వివరాలు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అనుమానితులను డిప్యూటీ పారామెడికల్ అధికారి (డీపీఎంఓ), మండల వైద్యాధికారి కలిసి పరీక్షిస్తారు. వీరి పరీక్షల్లో కుష్టువ్యాధిని నిర్ధారిస్తే వారికి చికిత్సను అందిస్తారు.

లక్షణాలు

- వెంట్రుకలు, గోర్లు మినహాయిస్తే శరీరంలో ఎక్కడైనా మచ్చలు ఏర్పడతాయి.
- మచ్చలు మొద్దుబారుతాయి.
- మచ్చలు ఉన్న చోట వెంట్రుకలు ఊడిపోవడం, చమట పట్టదు.
- కనుబొమ్మల్లో వెంట్రుకలు తక్కువగా ఉంటాయి.
- నరాలు ఉబ్బెత్తుగా ఉంటాయి.
- శరీరం జిడ్డుగా మారుతుంది.
- పాదాలకు గాయాలైతే త్వరగా తగ్గకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ

వ్యాధిని మొదట్లోనే గుర్తిస్తే మందులతో తగ్గించవచ్చు. వ్యాధి లక్షణాలు బయటపడేందుకు ఏడేళ్ల సమయం పడుతుంది. వ్యాధిగ్రస్తులను పాసీ బాచిలరీ, మల్టీ బాచిలరీ రకాలుగా చికిత్సను అందిస్తారు. పాసీ బాచీలరీలో ఒక్క మచ్చ, ఒక్క నరం గుర్తిస్తే ఆరు నుంచి తొమ్మిది నెలల వరకు చికిత్సను అందిస్తారు. మల్టీ బాచిలరీలో రెండు కంటే ఎక్కువ మచ్చలు, నరాలను గుర్తిస్తే ఏడాది నుంచి 18 నెలల వరకు చికిత్స అవసరం ఉంటుంది. చికిత్సకు అవసరమైన మందులను ప్రభుత్వం ఉచితంగానే అందిస్తోంది.

మొదట్లో గుర్తిస్తే చికిత్స సులువు



ప్రస్తుతం మండల పరిధిలో ఎవరికీ చికిత్స అందించడం లేదు. ప్రాథమిక దశలో గుర్తిస్తే మందులతో నిర్మూలించవచ్చు. ఈ వ్యాధి ప్రాణాంతకం కాదు. శాశ్వత వైకల్యం ఏర్పడే అవకాశాలు ఉంటాయి.

– డాక్టర్ నిఖిత, మండల వైద్యాధికారి, కేశంపేట

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్: గ్రామ పంచాయితీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జీపీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంల ఆవరణలో ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... పంచాయతీ కార్మికులకు రెండు నెలల వేతనాలను మాత్రమే కార్మికుల ఖాతాలలో వేశారని, మరో మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించడంతో పాటుగా పర్మినెంట్ గుర్తింపు కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ బన్సీలాల్ మాట్లాడుతూ.. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, మా పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చా రు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, నా యకులు రాజునాయక్, శంకర్‌నాయక్, జీపీ కార్మికులు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల 'డబుల్ ధమాకా'!

- వెటర్నరీ డాక్టర్‌ను టార్గెట్ చేసిన కేటుగాళ్లు
- ఆర్మీ జాగిలాలకు వ్యాక్సినేషన్ పేరుతో ఎర
- పే టెస్టింగ్, రీఫండ్ పేర్లతో నగదు స్వాహా
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో బాధితుడి ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ పశువైద్యుడిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆర్మీ జాగిలాలకు వ్యాక్సినేషన్ పేరుతో ఎర వేశారు. పేటెస్టింగ్ అని, ఆ మొత్తం రిఫండ్ అంటూ రెండుసార్లు టోకరా వేశారు. మొత్తమ్మీద రూ.1.79 లక్షలు కోల్పోయిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. సదరు పశువైద్యుడికి (27) రెండు రోజుల క్రితం ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆర్మీ అధికారులుగా చెప్పుకున్న వ్యక్తులు బాధితుడితో మాట్లాడారు. తమ యూనిట్‌లో ఉన్న 90 జాగిలాలకు వ్యాక్సినేషన్ చేయాలని చెప్పారు. ఈ పశువైద్యుడు గతంలో కొన్ని ఆర్మీ జాగిలాలకు వ్యాక్సిన్లు వేసి ఉండటంతో ఈ పని చేయడానికి అంగీకరించారు. ఇతడిని పూర్తిగా నమ్మించడానికి సైబర్ నేరగాళ్లు ఆర్మీ అధికారుల మాదిరి తయారు చేసిన నకిలీ గుర్తింపుకార్డుల్నీ పంపారు. చెల్లింపుల విషయం ఖరారు చేయడానికి తమ ఉన్నతాధికారులు సంప్రదిస్తారంటూ సైబర్ నేరగాళ్లు చెప్పారు. ఆపై కాల్ చేసిన మరికొందరు ఆర్మీ ఉన్నతాధికారులుగా పరిచయం చేసుకున్నారు. ఇది ఆర్మీకి సంబంధించిన వ్యవహారం కావడంతో వీడియో కాల్‌లో మాట్లాడుకుందామని చెప్పారు. ఆర్మీ అధికారుల యూనిఫాంలోనే ఉండి మాట్లాడిన సైబర్ నేరగాడు మొత్తం బిల్లులో సగం వ్యాక్సినేషన్ ప్రారంభించడానికి ముందు, మిగిలిన మొత్తం తర్వాత ఇస్తామని చెప్పాడు. పే చేసిన మొత్తం మీకు చేరుతుందో లేదో పరీక్షించాలంటూ వైద్యుడి ఫోన్‌లో ఫేన్ పే తెరిపించారు. అందులోని క్రెడిట్ కార్డు బిల్లు పేమెంట్ సెక్షన్‌లోకి వెళ్లమని చెప్పారు. తమ క్రెడిట్‌కార్డుకు సంబంధించిన వివరాలు, ఫోన్ నెంబర్ చెప్పిన సైబర్ నేరగాళ్లు ఆ మొత్తం చెల్లించమని చెప్పారు. తనకు నగదు కావాల్సి ఉండగా తాను చెల్లించడం ఏమిటంటూ బాధితుడు ప్రశ్నించాడు. తమ క్రెడిట్ కార్డుకు టూ స్టెప్ వెరిఫికేషన్ విధానం అమలో ఉందని, మీరు పే బటన్ నొక్కినా చెల్లింపు పూర్తి కాదని నమ్మించారు. ఇది నమ్మిన వైద్యుడు అలా చేయడంతో కొంత మొత్తం నష్టపోయారు. దీనిపై సైబర్ నేరగాళ్లను ప్రశ్నించగా..ఆ మొత్తం రిఫండ్ వస్తుందంటూ మరోసారి అలానే చేయించారు. రెండోసారి చేయడానికి బాధితుడు సంశయించగా.. అలా చేయకపోతే రిఫండ్ రాదని భయపెట్టారు. దీంతో రెండోసారీ సైబర్ నేరగాళ్ల క్రెడిట్‌కార్డు బిల్లు చెల్లించిన వైద్యుడు రూ.1,79,998 నష్టపోయారు. ఐదు నిమిషాల్లో మొత్తం రిఫండ్ వస్తుందని చెప్పిన నేరగాళ్లు ఆపై స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు బాధితుడు గుర్తించాడు. ఈ మేరకు మంగళవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నిందితుల ఫోన్ నెంబర్లతో పాటు క్రెడిట్‌కార్డు వివరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బ్యాంక్ మేనేజర్ మృతి

పహాడీషరీఫ్: గుండె పోటుతో ఓ బ్యాంక్ మేనేజర్ మృతిచెందిన సంఘటన బాలాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన ప్రకారం.. ఎర్రకుంట అలీనగర్‌కు చెందిన షోయబుద్దీన్ (27) ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం తన స్నేహితుడితో కలిసి బండ్లగూడలో ఓ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టి ఇంటికి వెళ్లే క్రమంలో ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పాడెడు. స్నేహితుడి బైక్‌పై వెనుక కూర్చొని ఆస్పత్రికి వెళుతున్నారు. ఎర్రకుంట వద్దకు రాగానే నొప్పి అధికమై ఒక్కసారిగా కింద పడిపోయాడు. గమనించిన స్నేహితుడు సీపీఆర్ చేసి, చాంద్రాయణగుట్టలోని బాకోబాన్, లైఫ్‌లైన్ ఆస్పత్రులకు తీసుకెళ్లగా పరిస్థితి విషయమంగా ఉందని మరో హాస్పిటల్‌కు తీసుకెళ్లాలన్నారు. ఒవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. మృతుడి భార్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళా ఆరోగ్యంతోనే సంతోషం

ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినితాదేవి



యాచారం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ వినితాదేవి

యాచారం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాల్లో సంతోషం ఉంటుందని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినితాదేవి అన్నారు. మంగళవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళల ఆరోగ్యం, గర్భిణి, బాలింతలకు అందించే పౌష్టికాహారం, చిన్నపిల్లల సంరక్షణపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ దూల్‌పేట' సక్సెస్

- గంజాయి నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- 250 రోజుల్లో 102 కేసుల నమోదు
- 401 కిలోల గంజాయి స్వాధీనం
- 425 మందిపై కేసులు

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఎక్సైజ్ అధికారులు చేపట్టిన 'ఆపరేషన్ ధూల్‌పేట్' కొనసాగుతోంది. ఇప్పటి వరకు గడిచిన 250 రోజుల్లో 102 కేసుల్లో 425 మందిని నిందితులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వారిలో 327 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. 13 మందిని బైండోవర్ చేశారు. మరో 85 మంది నిందితులు పరారీలో ఉన్నారు. మొత్తం 401 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే 147 సెల్‌ఫోన్‌లు, 58 బైక్‌లు, 2 కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా, ఏపీ, తదితర రాష్ట్రాల నుంచి నగరానికి గంజాయి సరఫరా చేసే ముఠాలపైన నిఘాను కఠినతరం చేశారు. పీడీ యాక్ట్‌లతో పాటు, పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. తప్పించుకొంటున్న లేడీ డాన్‌ల ఆటకట్టించినట్లు చెప్పారు. గతేడాది జూలై 17వ తేదీన ఎక్సైజ్‌శాఖ ఆపరేషన్ ధూల్‌పేట్‌ను ప్రారంభించింది. ఇప్పటి వరకు సాధించిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని నగరమంతటా ఇదే తరహాలో దాడులు, తనిఖీలను ఉధృతం చేసేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం ధూల్‌పేట్‌లో 90 శాతం గంజాయి అమ్మకాలు తగ్గాయని, పూర్తిగా నిర్మూలించే వరకు దాడులను కొనసాగిస్తామని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

మాడ్గుల: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్ రావు తెలిపిన ప్రకారం.. మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. మండల పరిధిలోని అందుగుల శివారు నుంచి ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని నిలిపి పత్రాలు పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ వాహన యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

అచ్చం అలాగే!

2007 మాదిరిగానే 2013 నాటి పేలుళ్లు

- మకాం నుంచి విధ్వంసం వరకు సారూప్యత
- రెండు విధ్వంసాలకూ ఐఎం సంస్థదే బాధ్యత
- దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు నేపథ్యం..
- ఐదుగురు నిందితులకు ఎన్ఐఏ కోర్టు ఉరిశిక్ష
- తీర్పును సమర్థించిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, సిటీబ్యూరో: నిషేధిత ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఐదున్నరేళ్ల వ్యవధిలో నగరంలో రెండు భారీ విధ్వంసాలను సృష్టించింది. 2007 ఆగస్టు 25న గోకుల్‌చాట్, లుంబినీపార్క్‌ల్లో బాంబుల్ని పేల్చి 47 ప్రాణాలు తీసి, మరో 300 మంది వరకు క్షతగాత్రుల్ని చేసింది. ఆ తర్వాత 2013 ఫిబ్రవరి 21న ముష్కరులు మరోసారి 18 మందిని చంపి, 131 మందిని క్షతగాత్రుల్ని చేశారు. ఈ రెండు ఆపరేషన్ల మధ్య అనేక సారూప్యతలు ఇలా ఉన్నాయి. దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో ఐదుగురు నిందితులకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 2016లో ఉరిశిక్ష విధించగా.. దీనిని సమర్థిస్తూ తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.

అనుమానం రాని చోట మకాం..

సిటీని టార్గెట్‌గా చేసుకుని విధ్వంసం సృష్టించడానికి నిర్దేశిత సమయం ముందు వచ్చిన ఐఎం ఉగ్రవాదులు పోలీసుల దృష్టి పడని, వారికి అనుమానం రాని ప్రాంతాల్లోనే షెల్టర్లు ఏర్పాటు చేసుకున్నారు. 2007 నాటి జంట పేలుళ్ల కోసం నగరానికి వచ్చిన ఉగ్రవాదులు హబ్సిగూడలోని స్ట్రీట్ నెం.8లో ఉన్న బంజారా నిలయం అపార్ట్‌మెంట్‌లోని 302 ఫ్లాట్‌ను ఎంచుకుంటే.. 2013 ఫిబ్రవరి నాటి దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్ పూర్తి చేయడం కోసం వచ్చిన వారు అబ్దుల్లాపూర్‌మెట్ సాయినగర్‌లో ఉన్న రేకుల ఇంటిలో ఆశ్రయం పొందారు. ఈ రెండు సందర్భాల్లోనూ విద్యార్థులం అంటూనే ఇళ్లు అద్దెకు తీసుకున్నారు. రెండు ఇళ్ల యజమానులూ వాటికి సమీపంలో లేకపోవడం వీరికి కలిసి వచ్చింది.

రెండుసార్లూ ముగ్గురే..

గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ విధ్వంసాల కోసం ముష్కరులు 25 రోజుల ముందు నగరానికి చేరుకోగా.. దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కోసం మాత్రం కేవలం 16 రోజుల ముందే వచ్చారు. 2007లో తొలుత అనీఖ్ షఫీఖ్ సయీద్ (లుంబినీ పార్క్‌లో బాంబు పెట్టాడు) అనే ఉగ్రవాది వచ్చాడు. షెల్టర్ ఏర్పాటు చేశాక అక్బర్ ఇస్మాయిల్ చౌదరి (ఇతడు పెట్టిన బాంబు పేలలేదు)ని పిలిపించాడు. ఇద్దరూ కలిసి ప్రాథమిక రెక్కీలు పూర్తి చేసిన తర్వాత పేలుడుకు రెండు రోజుల ముందు మాత్రమే ప్రధాన సూత్రధారి, పాత్రధారి అయిన రియాజ్ భత్కల్ (గోకుల్ చాట్‌లో పెట్టింది ఇతడే) చేరుకుని బాంబుల పని పూర్తి చేశాడు. ఆ తర్వాత ఒక రోజు తమ గదిలోనే ఉండి తిరిగి వెళ్లారు. దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్ కోసం మొదట తెహసీన్ అక్తర్ అలియాస్ మోను (ఏ-1 మిర్చ్ సెంటర్ వద్ద బాంబు పెట్టిన వ్యక్తి) రాగా.. కొన్ని రోజులకు తబ్రేజ్, వఖాస్ (107 బస్టాప్‌లో పెట్టిన వ్యక్తి) వచ్చారు. ఈ ముగ్గురూ కలిసి రెండు పేలుళ్లు జరిపి వెళ్లారు.

కామన్ 'పాయింట్' దిల్‌సుఖ్‌నగర్

2007లో గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ పేలుళ్ల ఆపరేషన్, 2013లో ఏ-1 మిర్చ్ సెంటర్, 107 బస్టాప్‌ల వద్ద జరిగిన విధ్వంసం ఈ రెండు అంశాల్లోనూ దిల్‌సుఖ్‌నగర్ కామన్ పాయింట్‌గా ఉంది. అప్పట్లో గోకుల్‌చాట్‌లో రియాజ్, లుంబినీ పార్క్‌లో అనీఖ్ బాంబులు పెట్టగా... అక్బర్ మరో బాంబును దిల్‌సుఖ్‌నగర్‌లోని వెంకటాద్రి థియేటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ వద్ద వదిలి వెళ్లాడు. ఆ రెండూ పేలగా... ఇది పేలలేదు. దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్‌లో మాత్రం ఉగ్రవాదులు నేరుగా దిల్‌సుఖ్‌నగర్‌నే టార్గెట్ చేసి రెండు బాంబుల్ని పేల్చారు. ఈ రెండు ఉదంతాలపై నమోదైన ఐదు కేసుల్లోనూ రియాజ్ భత్కల్ ప్రధాన నిందితుడిగా, మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. 2007లో నేరుగా వచ్చి హబ్సిగూడలోని గదిలో బాంబుల్ని అసెంబుల్ చేసి గోకుల్ చాట్‌లో బాంబు పెట్టగా.. 2013లో మాత్రం పాకిస్థాన్ నుంచి నేతృత్వం వహించి చేయించాడు. బాంబుల అసెంబ్లింగ్ బాధ్యతల్ని వఖాస్‌కు అప్పగించాడు.

మంగుళూరు నుంచే 'పార్సిల్స్'

ఈ రెండు జంట పేలుళ్లకు అవసరమైన పేలుడు పదార్థం, డిటొనేటర్లు ఉగ్రవాదులు నగరానికి చేరుకున్న తర్వాతే వారికి అందాయి. 2007లో విధ్వంసం సృష్టించడానికి పదిహేను రోజుల ముందు మంగుళూరు నుంచి రియాజ్ భత్కల్ పేలుడు పదార్థంతో పాటు ఇతర ఉపకరణాలను ఓ బస్సు ద్వారా పంపాడు. వీటిని అనీఖ్, అక్బర్‌లు చాదర్‌ఘాట్‌లో రిసీవ్ చేసుకున్నారు. 2013లో మాత్రం తబ్రేజ్ నేరుగా మంగుళూరు నుంచి తీసుకువచ్చాడు. ఇతడిని మోను ఎల్బీనగర్ చౌరస్తాలో రిసీవ్ చేసుకుని తమ డెన్‌కు వెంటపెట్టుకు వెళ్లాడు. 2007లో చెక్కతో చేసిన షేప్డ్ బాంబుల్ని పేల్చగా.. 2013లో మాత్రం ప్రెషర్ కుక్కర్లతో తయారు చేసిన బాంబుల్ని పేల్చారు. రెండు సందర్భాల్లోనూ పేలుడు పదార్థంగా అమోనియం నైట్రేట్‌నే వినియోగించారు.

రెండుసార్లూ మారిన 'టార్గెట్స్'

ఈ రెండు ఆపరేషన్లలోనూ ఉగ్రవాదులు ఆఖరి నిమిషంలో అనుకోని ప్రాంతాన్ని టార్గెట్‌గా చేసుకుని బాంబు పెట్టాల్సి వచ్చింది. 2007లో ఉగ్రవాదులు టార్గెట్ చేసిన ప్రాంతాల్లో గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లతో పాటు హుస్సేన్‌సాగర్‌లో తిరిగే షికారు బోటు ఉంది. అయితే.. ఇందులో బాంబు పెట్టేందుకు ట్రిగ్గర్ ఆన్ చేసుకుని ఆటోలో వెళ్లిన అనీఖ్.. ఆటోవాలాకు చెల్లించేందుకు అవసరమైన చిల్లర లేకపోవడంతో బాంబు పేలే సమయం సమీపించి లుంబినీపార్క్ లేజేరియం వద్ద వదిలి వెళ్లాడు. 2013 ఫిబ్రవరి 21న సైతం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏ-1 మిర్చ్ సెంటర్‌తో పాటు దాని వెనుక ఉన్న ఓ మద్యం దుకాణాన్ని టార్గెట్ చేశారు. అయితే.. అక్కడికి బాంబుతో కూడిన సైకిల్‌ను తీసుకువెళ్తున్న వఖాస్ సమయం మించిపోతుండటంతో 107 బస్టాప్ వద్ద పార్క్ చేసి వెనక్కు వెళ్లిపోయాడు.